జల సవ్వడులు

తుంగభద్ర నదీమతల్లి జలకళతో పునరుజ్జీవం పోసుకుంది. తీరం ఆనుకుని బతికే జీవులకు ప్రాణాధారమై వర్ధిల్లుతోంది. కోనసీమను తలపించేలా రైతుల మోముల్లో వెలుగును నింపుతోంది. తీరం వెంట రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ, మైనర్ ఇరిగేషన్ ఎత్తిపోతల పథకాల జల గలగల సవ్వడులకు మూలమై మురిపెం తెచ్చింది.

- నాలుగేళ్లుగా తుంగభద్రలో పుష్కలంగా నీటి ప్రవాహం
- తీరంలోని సాగునీటి ఎత్తిపోతలకు జీవం
- 35 వేల ఎకరాల్లో వరి, ఆరుతడి పంటల సాగు

మంత్రాలయం: నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 3 మండలాలకు తుంగభద్ర నదీ తీరం ఉంది. నియోజకవర్గ కేంద్రం నుంచి దాదాపు 60 కి.మీ. వరకు కొనసాగుతుంది. కౌతాళం మండలం మేళిగనూరు మొదలు మంత్రాలయం వరకు తీరం ఉంది. 17 గ్రామాల సాగు, తాగునీటికి నదీ జలాలే ఆధారం. తీరం వెంట దాదాపు 30 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో ఏపీఐడీసీ స్కీం పరిధిలో దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నిర్ణీత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతోంది. సమృద్ధిగా వర్షాలు కురవడం, నదిలో పుష్కలంగా వరద జలాలు పారడం.. పథకాలు నిర్విరామంగా నీటిని ఎత్తిపోయడంతో పంటలకు సాగునీటి ఎద్దడి తప్పింది.

నిండుగా జలాశయాలు..

తుంగభద్ర డ్యాం నుంచి అవుట్‌ఫ్లో మోస్తరుగా ఉండటంతో ఎత్తిపోతల జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి.పులికనుమ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, ఏపీఐడీసీ పథకాలకు నదిలో పుష్కలంగా నీరు లభిస్తోంది. రెండో కారుకు కూడా నీటిని మళ్లించుకుని పంటల సాగుకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. ప్రస్తుతం పులికనుమ ప్రాజెక్టు జలాశయంలో 1.39 టీఎంసీల నీరు నిల్వఉంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని మూగలదొడ్డి, దుద్ది,మాధవరం, బసలదొడ్డి, చిలకలడోణ, పూలచింత, సోగనూరు,కృష్ణదొడ్డి, చింతమాన్‌దొడ్డి, రేమట, మునగాల రిజర్వాయర్లతోపాటు గుర్రేవల ప్రాజెక్టు పరిధిలోని వగరూరు మైనర్ ఇరిగేషన్ జలాశయంలోనూ నీటికి కొదవలేదు. రబీ సీజన్‌లోనూ ఆయా ప్రాజెక్టుల పరిధిలో 25వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వీటితోపాటు ఏపీ ఐడీసీ కింద ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 29 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. రబీలోనూ తుంగభద్ర దిగువ కాలువకు పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి. ఎల్లెల్సీ పరిధిలో నూమాగాణి సాగవ్వడం విశేషం. పులికనుమ పరిధిలో 24,600 ఎకరాలు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలో దాదాపు 26 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇవే కాకుండా ఇటీవల నియోజకవర్గంలో రూ.73 కోట్లతో కొత్తగా 6 ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నారు.

రెండోకారు జోరు..

మంత్రాలయం మండలంలో ఏపీఐడీసీ పథకాల పరిధిలో సూగూరు ఎత్తిపోతల కింద 950 ఎకరాలు, మంత్రాలయం పథకం కింద 350 ఎకరాలు చెట్నిహళ్లి స్కీం పరిధిలో 300 ఎకరాలు, మాధవరం పథకంతో 250 ఎకరాలు, బూదూరు పరిధిలో 500 ఎకరాలు, మాధవరం-2 పరిధిలో 900 ఎకరాలు, కౌతాళం మండలం మేళిగనూరు పథకం కింద 432, కాత్రికి పరిధిలో 450 ఎకరాలు, లింగాలదిన్నె కింద 400, కుంభళనూరు పథకం కింద 1400 ఎకరాలు, అగసనూరు 600 ఎకరాలు, కడదొడ్డి 300 ఎకరాలు, కందకూరు 600 ఎకరాలు, బొమ్మలాపురం కింద 300 ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే నందవరం మండల పరిధిలో 27 కి.మీ.మేర నదీతీరం ఉంది. ఇందులో కనకవీడు, సోమలగూడూరు, గురజాల, నాగలదిన్నె, మిట్టసోమాపురం, చిన్నకొత్తిలి, రాయచోటి గ్రామాల పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు.



నిండుకుండలా పులికనుమ జలాశయం



కోసిగి మండలం జుమ్మాలదిన్నె వద్ద ఎల్లెల్సీ పరిధిలో సాగు చేసిన వేరుశనగ పైరు



తుంబిగనూరు సమీపంలో నదీ తీరంలో వరి పైరు సోయగం

నిశ్చింతగా పంటలు



2019 వరకు వానల్లేక నానా కష్టాలు పడ్డాం. నది ఎండిపోయిన రోజులెన్నో. మూడేళ్లుగా తీర ప్రాంత రైతులకు మంచి రోజులు వచ్చాయి. నదిలో వరద నీరు పుష్కలంగా పారుతోంది. రెండు కారులు పంటలు పండించుకుంటున్నాం. నాకున్న రెండు ఎకరాల్లో రెండో కారు కింద వరి నాటు వేశాం.

– రామిరెడ్డి, కోసిగి, రైతు

పుష్కలంగా నీళ్లు



నదిలో పుష్కలంగా నీరు పారుతోంది. పంటలు చేతికొచ్చే వరకు సాగునీటికి భయం లేదు. ఇలాంటి రోజులు పదేళ్ల క్రితం చూశాం. మళ్లీ ఈనాటికి మంచి రోజులు వచ్చాయి. ముఖ్యంగా పులికనుమ ప్రాజెక్టు నిర్మించి వైఎస్సార్ ఎంతో మేలు చేశారు. ఈసారి రాజనాలు పండించాం.

– ఎం.సి.ఈరన్న, కోసిగి

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: రాజకీయాల్లో సామాజిక న్యాయం పాటించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందని ఆ పార్టీ యువనేత వై.ప్రదీప్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా శాసనసభ, శాసనమండలి, స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల్లోనూ అన్ని కులాలు, వర్గాలు, మహిళలకు సమాన స్థాయిలో ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదు బ్యాక్ బోన్ అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారన్నారు. ఆదోనికి చెందిన మధుసూదన్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషించదగ్గ విషయమన్నారు. హామీల అములులో గత పాలకులు ఎలా వ్యవహరించారు, సీఎం జగనన్న ఎలా పాలన చేస్తున్నారో గమనించాలని ప్రజలను కోరారు.

లక్ష్యసాధనకు శ్రమించండి



ప్రిన్సిపాల్ రమేష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కోసిగి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ఇష్టంతో శ్రమిస్తే సాధించడం సులువేనని కోసిగి, మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు,రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో ఎంచుకున్న గ్రూప్స్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసునట్టేనన్నారు. అనంతరం కోసిగిలో పనిచేసి బదిలీ పై వెళ్లిన మంత్రాలయం ప్రిన్సిపాల్ రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ చౌడయ్య, కళాశాల చైర్మెన్ హనుమంతు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : రైతులు పండించిన జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ద్వారా క్వింటా రూ.2970 ప్రకారం కొనుగోలు చేస్తుందన్నారు. కాగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.2,700 పలుకుతోందని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల జొన్నలను స్థానికంగానే కొనుగోలు చేసి వెంటనే నగదును చెల్లిస్తామన్నారు. వివరాలకు ఆయా గ్రామాల రైతులు, వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. అలాగే తహసీల్దార్ వెంకటలక్ష్మి తన కార్యాలయంలో మాట్లాడుతూ.. జొన్నలను తక్కువ ధరకు విక్రయించుకోవద్దని రైతులను కోరారు. రైతులు ధాన్యాన్ని ఎక్కడికి తీసుకురావాలి, ఎక్కడ కొనుగోలు చేస్తారనే వివరాలను త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.

పరిహారం పంపిణీ



వీరేష్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రానికి చెందిన పీకల బెట్ట వీరేష్ అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రె జనవరి 19న చిరుత పులి దాడిలో మృతి చెందింది. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధితుడికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.9,200 నష్టపరిహారం చెక్కును ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మాణిక్యరాజు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మణిధర్ నాయుడు అందజేశారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రాత్రి పూట కొండ పరిసరాల్లో గొర్రెల మంద ఆపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిరుతలకు ఎవరూ ఎలాంటి హాని కలిగించరాదని సూచించారు. గొర్రెలు, మేకలు చిరుత దాడికి గురైతే సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు.

ముగిసిన దేవర

మంత్రాలయంరూరల్: చెట్నేహళ్లి గ్రామంలో వెలసిన భీరప్ప స్వామి దేవర బుధవారం ముగిసింది. తెల్లవారుజాము నుంచి కల్లుకుంట యాదగిరప్ప, ఎమ్మిగనూరు మండలం మసీదుపురం వణికేరప్ప, చెట్నేహళ్లి గ్రామంలో వెలసిన అలింగప్పకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

నేడే మార్కెట్ వేలాలు

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బహిరంగ మార్కెట్లకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అస్లాంబాషా బుధవారం తెలిపారు. ఈనెల 16న మార్కెట్‌లకు వేలాలను నిర్వహించగా కాంట్రాక్టర్‌లు తక్కువ మంది పాల్గొనడంతో ఈనెల 23వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందేనన్నారు. మున్సిపాలిటీ నిర్ణయించిన ధరల మేరకు వేలం పాటలు పాడాలని కాంట్రాక్టర్‌లను కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు

కోసిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారి ఆదోని నిర్వాహకురాలు నిర్మల, అమృతేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని శివలింగాన్ని కలశాలు, మేళతాళాలతో పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఈశ్వర దేవాలయం నుంచి దొరలచావిడి మీదుగా బస్టాండ్ నుంచి ఆలయం వరకు ఊరేగించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు మార్గం వీడి సన్మార్గంలో నడవాలని కోరారు.

26న సంగీత విభావరి

ఆదోనిటౌన్: ఈనెల 26వ తేదీన స్థానిక మంగళ ఆంజనేయస్వామి సన్నిధిలో గాన గంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతి సందర్భంగా సంగీత విభావరి నిర్వహించనున్నట్లు అఖిలసేన ఆర్కెస్ట్రా సంఘం సభ్యుడు బండారి మారెన్న బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, పట్టణ ప్ర ముఖులు తదితరులు పాల్గొననున్నారని చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన పి.ఖాజాబీ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 19వ తేదీన మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ పుణ్యవతి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతురాలి బంధువులకు బుదవారం రూ.10వేలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ బీమా పథకం ద్వారా మంజూరైన మిగిలిన మొత్తం నామిని బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గొర్రెల ఫెడరేషన్ డైరెక్టర్ యల్లప్ప, వలంటీర్లు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్

ఆదోని టౌన్ : ముస్లిం, మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్ అహ్మద్, మార్కెట్‌యార్డు చైర్మన్ మాబాషా,ముస్లిం మైనార్టీ నాయకులు రహమాన్, షఫీఅహ్మద్, బాషా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి సీఎం కట్టుబడి ఉన్నారని తెలిపారు. టీడీపీ పాలనలో ముస్లిం, మైనార్టీలకు ఒక ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ, మంత్రులుగా కానీ, నామినేటెడ్ పదవుల్లోనైనా అవకాశం కల్పించలేదని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేశారని చెప్పారు. సామాజిక న్యాయం చేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లడమే టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. మైనార్టీలకు ఒక్క ఎమ్మెల్సీ సీటు కూడా కేటాయించలేదని చెప్పే టీడీపీ నాయకులకు.. రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది ముస్లిం మైనార్టీలు ఏయే పదవుల్లో ఉన్నారో తెలియకుండానే మాట్లాడడం ఆరోపణలు చేయడం తగదన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ఆలూరు రూరల్: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి కాపురానికి రాలేదని రాజశేఖర్ (25) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆలూరు మండలం కురుకుందకు చెందిన కనకప్ప, జయమ్మ దంపతుల కుమారుడైన రాజశేఖర్‌కు రెండేళ్ల క్రితం పెద్దకడుబూరు మండలం దొడ్డిమేకల గ్రామానికి చెందిన నాగేశ్వరితో వివాహం జరిగింది. కుటుంబ కలహాల కారణంగా భార్య రెండు నెలలుగా తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. కాపురానికి రావాలని పిలిచినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాజశేఖర్ బుధవారం ఉదయం పొలంలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు.